## క్లుప్తంగా

### ఫిల్మ్ ఫెస్టివల్‌లో భారతీయ సినిమాకు అపూర్వ గౌరవం



నగరంపాలెం: ఫ్రాన్స్ దేశంలో జరుగుతున్న 78వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో భాగంగా భారత చలన చిత్రం 'హోమ్ బౌండ్' తొమ్మిది నిమిషాల స్టాండింగ్ ఓవేషన్ గౌరవం దక్కించుకుని అరుదైన రికార్డ్‌ను సృష్టించిందని మా–ఏపీ వ్యవస్థాపకులు, సినీ దర్శకుడు దిలీప్ రాజా పేర్కొన్నారు. గుంటూరు రాజీవ్ గాంధీనగర్‌లోని బ్యాంక్ కాలనీలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నీరజ్ ఘయ్యాన్ దర్శకత్వంలో జాన్వీ కపూర్, ఇషాన్ ఖట్టర్ నటించిన 'హోమ్ బౌండ్' సినిమా కేన్స్ అవార్డ్ కోసం ఎంపికైన తొలి భారతీయ సినిమా కావడం విశేషమని పేర్కొన్నారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జీవిత చరిత్ర ఆధారంగా నటుడు ధనుష్ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'ది మిస్సైల్ మేన్ ఆఫ్ ఇండియా' బయోపిక్ టైటిల్ పోస్టర్‌ను కేన్స్‌లో విడుదల చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. భారత అంతరిక్ష రక్షణ కార్యక్రమాలకు అబ్దుల్ కలాం అందించిన సేవలను దర్శకుడు ఓం రౌత్ తెరకెక్కిస్తున్నారని పేర్కొన్నారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి తెలుగు రాష్ట్రాల్లో థియేటర్లకు పర్సంటేజీ చెల్లించాలనే డిమాండ్‌తో సినిమాల ప్రదర్శనలను నిలిపివేస్తున్నట్లుగా ఎగ్జిబిటర్లు ప్రకటించిన అంశాన్ని ప్రస్తావిస్తూ.. సినిమా పెద్దలు ఈ సమస్యకు పరిష్కార మార్గం చూపాలని ఆయన కోరారు. లేనిపక్షంలో వచ్చే నెల ఐదున మణిరత్నం దర్శకత్వంలో అగ్రనటుడు కమల్ హాసన్, త్రిష, శింబు నటించిన థగ్ లైఫ్, 12న హరిహర వీరమల్లు, 27న కన్నప్ప, 30న కుబేర, కింగ్‌డం వంటి పెద్ద చిత్రాలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆయన తెలిపారు.

### నేడు పాస్టర్ ప్రవీణ్ పగడాల సంస్మరణ సభ



నెహ్రూనగర్: పాస్టర్ ప్రవీణ్ పగడాల సంస్మరణ, ప్రార్థన సభ శుక్రవారం గుంటూరులోని ఎల్‌ఈఎం స్కూల్ గ్రౌండ్‌లో సాయంత్రం ఐదు గంటలకు నిర్వహిస్తున్నట్లు సామాజికవేత్త, క్రైస్తవ ఐక్య కార్యాచరణ కమిటీ నాయకుడు డాక్టర్ గోళ్లమూడి రాజా సుందరబాబు వెల్లడించారు. ఎల్‌ఈఎం హైస్కూల్ గ్రౌండ్‌లో గురువారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాస్టర్ ప్రవీణ్ ప్రగడాల హత్య విషయంలో ఉన్నత స్థాయి విచారణ, పాస్టర్లు, క్రైస్తవులు, చర్చిల రక్షణ కోసం ప్రత్యేక చట్టం, నగరం నలుమూలల క్రైస్తవుల సమాధుల తోటకు స్థలాలు మంజూరు చేయాలనే డిమాండ్లతో కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. క్రైస్తవులు, పాస్టర్లు, బిషప్‌లు, దైవ సేవకులు వేలాదిగా కదలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మద్దు ప్రేమజ్యోతిబాబు, పాస్టర్లు పి.సురేష్ జేమ్స్, పాస్టర్ బాబూరావు, మత్తయ్య, ఆనంద్, సంసోను, విజయబాబు, దీవెన రాజు, క్రైస్తవ ప్రజా సంఘ నాయకులు పాల్గొన్నారు.

**29న క్రైస్తవ సేవా సంఘం జేఏసీ ఆధ్వర్యంలో...**

క్రైస్తవ సేవా సంఘం జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 29న లాడ్జి సెంటర్ సమీపంలోని ఎల్‌ఈఎం స్కూలు గ్రౌండ్‌లో ప్రవీణ్ పగడాల సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు క్రైస్తవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు మల్లెల రాజు తెలిపారు. అరండల్‌పేటలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాస్టర్ ప్రవీణ్ ప్రగడాల మృతి క్రైస్తవులకు తీరని లోటని పేర్కొన్నారు. క్రైస్తవులకు రక్షణ కల్పించాలని కోరుతూ సంస్కరణ సభను ఏర్పాటు చేసినట్లు మల్లెల రాజు వివరించారు. సమావేశంలో నాయకులు వివిధ సంఘాల నాయకులు అబ్దుల్ ఖదార్, స్టాలిన్ బాబు, ప్రేమరాజు, జయసుధ, శ్యాంప్రసాద్, విల్సన్, పాల్ మనోహర్, ఆనంద పాల్, బుస్సా రత్న ప్రసాద్, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

### కొనసాగుతున్న సీహెచ్‌ఓల నిరసన



లక్ష్మీపురం: కలెక్టరేట్ కార్యాలయం ఎదుట డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద సీహెచ్‌ఓల నిరసన గురువారం 25వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా జిల్లా ఏపీఎంసీఏ సెక్రటరీ లింగరాజు యాదవ్, ట్రెజరర్ కె.సంధ్య మాట్లాడుతూ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా పని చేస్తున్న తమకు న్యాయ్యపరమైన హక్కులు, ఆయుష్మాన్ భారత్ నిబంధనలు ప్రకారం ఉద్యోగ భద్రత కలిపించాలని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23శాతం వేతన సవరణ చేయాలని కోరారు. తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో సమ్మె కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈనెల 20న రాష్ట్ర కార్యవర్గంతో ఆరోగ్య శాఖ కమిషనర్, అధికారులతో జరిగిన చర్చలు విఫలమయ్యారని, అధికారులు స్పందించిన తీరు బాధాకరంగా ఉందని చెప్పారు. తమ సమస్యల్ని ప్రభుత్వం పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో చీఫ్ అడ్వైజర్ కొడాలి సృజన, రాధిక, నితిషా, విజయలక్ష్మి, కళ్యాణి, మణికంఠ పాల్గొన్నారు.

# థైరాయిడ్ లోపంతో అన్నీ అనర్థాలే..!



- ఆడవారిలో బాధితులు అధికం
- అప్పుడే పుట్టిన బిడ్డకు సోకుతున్న వ్యాధి
- అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన
- 25న వరల్డ్ థైరాయిడ్ డే

■ బిడ్డకు ఐదేళ్ల వయస్సు వచ్చినా మరీ చిన్నపిల్లవాడిలాగా కనిపించడం... ఎంత తిన్నా లావు అవ్వడంలేదని పల్నాడుకు చెందిన శ్రీనివాసరావు, శ్రీలక్ష్మి దంపతులు ఇటీవల వైద్యులను సంప్రదించారు. పరీక్షలు చేసి థైరాయిడ్ వ్యాధికి గురైనట్లు చెప్పడంతో తల్లిదండ్రులు ఆశ్చర్యపోయారు. ఒక్కగానొక్క బిడ్డకు వ్యాధి ఎలా వచ్చిందో అర్థంగాక ఆవేదన చెందుతున్నారు.

■ తెనాలికి చెందిన రాజేశ్వరికి ఏడాది క్రితం వివాహమైంది. ఇటీవల గర్భం ధరించటంతో బరువు పెరగసాగింది. కడుపులో బిడ్డ ఉండటం వల్ల , అధికంగా పోషకాహారం తీసుకోవడం వల్ల బరువు పెరుగుతూ ఉండొచ్చని తల్లిదండ్రులు భావించారు. కాన్పు సమయంలో గుంటూరులోని స్పెషాలిటీ వైద్యులను సంప్రదించారు. థైరాయిడ్ వ్యాధికి గురైనట్లు రిపోర్టు రావడంతో భయపడ్డారు. అకస్మాత్తుగా వ్యాధి ఎలా సోకిందో అర్థం కాక ఆందోళన చెందారు.


గుంటూరు మెడికల్: థైరాయిడ్ గ్రంథిపై చాలా మందికి సరైన అవగాహన లేకపోవడంతో వ్యాధిని నియంత్రణలో పెట్టుకోలేక అవస్థలు పడుతున్నారు. గొంతు ముందు భాగంలో శ్వాసనాళానికి రెండువైపులా గులాబీ రంగులో ఇంచుమించు సీతాకోక చిలుక ఆకారంలో ఉండే గ్రంథిని థైరాయిడ్ అంటారు. ఇది మెదడులోని పిట్యూటరీ గ్రంథి స్రవించే థైరాయిడ్ స్టిమ్యులేటింగ్ హార్మోన్ (టి.ఎస్.హెచ్) ద్వారా టి-3, టి-4 అనే హార్మోన్లను ఉత్పత్తి చేస్తుంది. టి-4 అనగా థైరాక్సిన్. ఇది 20గ్రాముల బరువు ఉండి, శరీరంలోని చాలా జీవక్రియలను నియంత్రిస్తుంది. శరరం, ఎముకల పెరుగుదలను, శరరీరపు ఉష్ణోగ్రతను, మానసిక వికాసాన్ని అదుపు చేస్తుంది. వివిధ కణజాలాల అభివృద్ధికి తోడ్పడుతుంది. ఈ హార్మోను ఉత్పత్తికి మన శరీరంలో తగినంత అయోడిన్ అవసరం. రోజుకి 150 మైక్రోగ్రాముల (గుండుసూది తలంత) అయోడిన్ శరీరానికి అవసరం. థైరాక్సిన్‌లో 65శాతం అయోడిన్ ఉంటుంది. అయోడిన్ పెరుగుదలకు, శక్తి రావడానికి తోడ్పడుతుంది.

### వ్యాధి నిర్ధారణ

రక్తంలో టి-3,టి-4, టీఎస్‌హెచ్ అనే హార్మోన్లు ఎంతున్నాయో పరీక్షలు చేస్తారు. దీన్నే థైరాయిడ్ ప్రొఫైల్ అంటారు. ఈ పరీక్షలు చేయించడం ద్వారా వ్యాధి ఉందా లేదా నిర్ధారణ చేస్తారు.

### జిల్లాలో వ్యాధి బాధితులు

జిల్లాలో 12 ఎండ్రోక్రైనాలజీ వైద్యుల హాస్పిటల్స్ ఉన్నాయి. ఒక్కో ఆస్పత్రికి ప్రతిరోజూ 15 నుంచి 25 మంది థైరాయిడ్ వ్యాధి బాధితులు వస్తున్నారు. ఎండ్రోక్రైనాలజీ వైద్యులతోపాటు జనరల్ ఫిజిషియన్, ఇతర వైద్య నిపుణులను ప్రతిరోజూ సుమారు 20 నుంచి 40 మంది సంప్రదిస్తున్నారు.




### శరీరంలో పలు మార్పులు

వ్యాధి లక్షణాలు ఒక్కసారిగా కాకుండా నిదానంగా కనబడతాయి. ఇది వచ్చిన వారిలో హుషారు తగ్గి, అంతకు ముందులేని మందకొడితనం చోటు చేసుకుంటుంది. విపరీతమైన అలసట. నడవాలన్నా, పనిచేయాలన్నా ఓపిక ఉండదు. చర్మంలో తడి, నునుపుతనం తగ్గి, ఎండిపోయినట్లు ఉంటుంది. కండరాలు ఉబ్బుతాయి. దాని వల్ల శరీరం ఉబ్బుగా కనిపిస్తుంది. ఒళ్లు ఉబ్బరం వల్ల ఉబ్బు కామెర్లుగా భ్రమపడే అవకాశం ఉంది. మలబద్ధకం, కండరాలు పట్టివేసినట్లు ఉండటం, చర్మం కింద కొవ్వు చేరి బరువు పెరుగుతారు. గొంతు బొంగురుగా మారుతుంది. ముఖం గుండ్రంగా కనపడటం, మనిషి మందమతిగా మారతాడు. జీవక్రియ రేటు విపరీతంగా పెరిగి శరీరంలోని అన్ని శక్తి వనరులు ఖాళీ అవుతాయి. ఎముకల్లో క్యాల్షియం తక్కువై పెళుసు బారతాయి. తలమీద వెంట్రుకలు ఎక్కువగా రాలిపోతాయి. ముఖ్యంగా కనుబొమ్మల వెంట్రుకలు ఎక్కువగా రాలిపోతాయి. పిల్లల్లో పెరుగుదల ఉండదు. పిచ్చితనం వస్తుంది. లావు అవ్వడం, బరువు పెరగడం, మత్తు, నిద్ర, ఒళ్లు నొప్పులు, మలబద్ధకం, స్త్రీలలో రుతుచక్రంలో మార్పులు, గర్భం రావడం ఆలస్యం అవుతుంది. తరచూ గర్భస్రావాలు తదితర లక్షణాలు ఉంటాయి.

### పుట్టిన బిడ్డకు పరీక్షలు చేయించాలి



ఈ వ్యాధి అప్పుడే పుట్టిన బిడ్డ మొదలుకొని 90 ఏళ్ల వయస్సు వారికి వస్తుంది. మగవారి కన్నా ఆడవారిలో ఎక్కువగా థైరాయిడ్ గ్రంథి సమస్య వస్తోంది. ఆడవారిలో 80శాతం మందికి ఉంటే మగవారిలో 20శాతం మందికి వస్తుంది. జన్యు లోపాల వల్ల, తల్లికి ఉంటే బిడ్డకు, వంశపారంపర్యంగా వ్యాధి వస్తుంది.అప్పుడే పుట్టిన బిడ్డకు థైరాయిడ్ ఉందో లేదో నిర్ధారణ పరీక్ష చేయించడం ఉత్తమం.

– డాక్టర్ రేవూరి హరికృష్ణ, ఇన్‌ఫెక్షన్స్ స్పెషలిస్టు, గుంటూరు

### ముందే తెలుసుకోవచ్చు



యాంటీబాడీ టెస్ట్ చేయించుకోవడం ద్వారా థైరాయిడ్ వ్యాధి వచ్చే అవకాశం ఉందా లేదా ముందుగానే తెలుసుకోవచ్చు. ఆహారంలో అయోడిన్ లోపం లేకుండా చూసుకోవటం వల్ల కొంత వరకు బారిన పడకుండా కాపాడుకోవచ్చు. థైరాయిడ్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు, మందులు కొత్తగా వచ్చాయి. వీటి ద్వారా త్వరితగతిన నిర్ధారణ రాకుండా వ్యాధి కట్టడి చేయవచ్చు. కొన్ని రకాల థైరాయిడ్‌లను పూర్తిగా నివారించవచ్చు. వ్యాధి సోకిన వారిలో ఒక్కో విధంగా లక్షణాలు ఉంటాయి.

– డాక్టర్ నందిపాటి వెంకట సందీప్, ఎండ్రోక్రైనాలజిస్ట్, గుంటూరు

### మతం పేరుతో అనైక్యత సృష్టిస్తున్న బీజేపీ

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి



లక్ష్మీపురం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల మధ్య మతం పేరుతో అనైక్యతను సృష్టిస్తోందని, ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి పిలుపునిచ్చారు. బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.నళినీకాంత్ అధ్యక్షతన జిల్లా విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక నిత్యావసర సరుకుల ధరలు, పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని తెలిపారు. మరోవైపు ప్రభుత్వరంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతుందని విమర్శించారు. మతోన్మాద బీజేపీని ఒంటరి చేసి ఓడించాలని, సీపీఎం అఖిల భారత మహాసభ పిలుపుకు అనుగుణంగా పార్టీని సమాయత్తం చేయాలని తెలిపారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్.బాబూరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం బీజేపీ విధానాలనే అమలు చేస్తోందని విమర్శించారు. మాజీ ఎమ్మెల్సీ కె.యస్.లక్ష్మణరావు మాట్లాడుతూ గుంటూరు నగరంలో భవిష్యత్ ప్రజా అవసరాల దృష్ట్యా శంకర్‌విలాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు. నగరంలో బృందావన్ గార్డెన్స్ వద్ద అసంపూర్తిగా ఉన్న నార్ల ఆడిటోరియాన్ని ప్రభుత్వ రంగంలోనే పూర్తి చేయాలని కోరారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ నల్లబర్లీ పొగాకును ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరారు. గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు నిధులు కేటాయించాలని సమావేశంలో తీర్మానించినట్లు తెలిపారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు, ఈ.అప్పారావు, ఎన్.భావన్నారాయణ, ఎం.రవి, బూరుగ వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు వి.జవహర్‌లాల్, బి.లక్ష్మణరావు, ఎం.ఎ.చిష్టీ, బి.సుధాకిరణ్, ఎల్.అరుణ, యు.దుర్గారావు పాల్గొన్నారు.

### తొలి సంఘ సంస్కర్త రాజా రామ్మోహన్‌రాయ్



గుంటూరు ఎడ్యుకేషన్: భారతదేశంలో వేళ్లూనుకున్న మూఢ, దురాచారాలకు వ్యతిరేకంగా పోరాటం చేసి, భారత జాతి పునర్జీవానికి కృషి చేసిన తొలి సంఘ సంస్కర్త రాజా రామ్మోహన్‌రాయ్ అని విద్యావేత్త డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి పేర్కొన్నారు. బాలానంద కేంద్ర సంస్థ ఆధ్వర్యంలో గురువారం రామ్మోహన్‌రాయ్ 253వ జయంతిని బ్రాడీపేటలోని రాజారామ్మోహన్ రాయ్ పాఠశాల ప్రార్థన సమాజం ఆవరణలో నిర్వహించారు. బాలానంద కేంద్ర కార్యదర్శి నడింపల్లి గురుదత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ రామ్మోహన్ రాయ్ ఉన్నత విద్యావంతుడుగా, బహు భాషా కోవిదుడిగా హిందూ, క్రైస్తవ, ముస్లిం గ్రంథాలను ఔపోసన పట్టి ఏకేశ్వరోపాసన స్థాపన కోసం 'బ్రహ్మ సమాజం' ఏర్పాటు చేశారని వివరించారు. సతీ సహగమనాన్ని, బాల్య వివాహాలను అప్పటి బ్రిటిష ప్రధాని విలియం బెంటింగ్ ద్వారా చట్టబద్ధంగా నిరోధించారని తెలిపారు. బాలానంద కేంద్రం గౌరవాధ్యక్షుడు కేతరాజు నరసింహారావు మాట్లాడుతూ సంస్కరణ వాదులైన రఘుపతి వెంకయ్య నాయుడు, అప్పటి మున్సిపల్ చైర్మన్ నడింపల్లి లక్ష్మీనరసింహారావు చేతుల మీదుగా రాజారాం మోహన్ రాయ్ పేరున బ్రహ్మ సమాజం అనబడే ప్రార్థన సమాజాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బాలానంద కేంద్ర ఉపాధ్యక్షులు మాజేటి వెంకట రామకోటి ముత్యాలు, కార్యవర్గ సభ్యులు శ్రీనివాసరావు, పి.ఎస్. మూర్తి, కె.రామ్ సుభాష్, మాజేటి వీఎస్ఆర్ ప్రసాద్, బాలానంద కేంద్ర పూర్వ విద్యార్థి, ఉపాధ్యాయ సంఘ కార్యదర్శి వావిలాల రామ్‌కుమార్ పాల్గొన్నారు.

### బ్లేడుతో వ్యక్తిపై దాడి

పట్నంబజారు: పనికి వెళ్లమని చెప్పినందుకు బ్లేడుతో వ్యక్తిని గాయపరిచిన సంఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్ఆర్ కాలనీకి చెందిన షేక్ నాగూర్ ఆటో తోలుతూ జీవనం సాగిస్తున్నాడు. స్నేహితుడైన గోపి ఇంటి వద్దనే ఉంటూ, వ్యసనాలకు బానిసగా మారాడు. దీంతో ఏదొక పనికి వెళ్లమని గోపీని నాగూర్ మందలించాడు. దీనిపై ఆగ్రహించిన గోపి గురువారం రాత్రి బ్లేడుతో నాగూర్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# భజే వాయుపుత్ర.. భజే వాలగాత్ర !



మారుతీనగర్‌లోని మారుతీ దేవాలయ ప్రాంగణంలో స్వామికి ప్రత్యేక అలంకారం



సంపత్‌నగర్ రామనామ క్షేత్రంలో..



ఏటుకూరు రోడ్డులోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో..



బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో..



విశాఖ శారదా పీఠ పరిపాలిత శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో..



కొత్తపేట ఆలయంలో స్వామికి క్షీరాభిషేకం

నగరంపాలెం: స్థానిక మారుతీనగర్‌లోని కంచి కామకోటి పీఠ మారుతీ దేవాలయ ప్రాంగణంలో హనుమజ్జయంతి మహోత్సవాల్లో భాగంగా ప్రసన్నాంజనేయస్వామికి విశేష ఆకుపూజలు నిర్వహించారు. భక్తులు 108 పర్యాయాలు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. సాయంత్రం శారద రామలింగేశ్వర భజన సమాజం భక్తి సంకీర్తన అలరించింది. ఆలయ పాలక మండలి సభ్యులు కొరపాటి రామారావు, కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

■ స్థానిక సంపత్‌నగర్ రామనామ క్షేత్రంలో ట్రస్టీస్ రాగం వెంకట లీలాసుందరి, మస్తాన్‌రావు దంపతుల ఆధ్వర్యంలో ఆలయ పూజారులు ఆంజనేయస్వామికి విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు, హనుమాన్ చాలీసా పారాయణాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

■ స్థానిక ఏటుకూరు రోడ్డులో శ్రీ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో 24వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామిని విశేషంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చండీ హోమం, మహా పూర్ణాహుతి, తీర్థ ప్రసాద, అన్న ప్రసాద వితరణలు జరిగాయి. అనంతరం 79 కిలోల లడ్డూ వేలం వేశారు. ఆలయ పాలకమండలి, భక్తుల సహకారంతో ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు.

■ పాత గుంటూరు ప్రధాన రహదారిలోని విశాఖ శారదా పీఠ పరిపాలిత వీరాంజనేయస్వామి దేవస్థానంలో 81వ హనుమత్ జయంతి మహోత్సవాలు జరిగాయి. గురువారం హనుమత్ గాయత్రీ హోమం, మహా పూర్ణాహుతి, యజమాన ఆశీర్వచనం చేపట్టారు. స్వామిని దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కొప్పురావూరి బాబూరావు, కార్యదర్శి కాసుల సాంబశివరావు, కోశాధికారి గ్రంథి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

■ బృందావన్ గార్డెన్స్ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళా వేదికపై గురువారం హనుమత్ జయంతి వేడుకలు జరిగాయి. ఆలయ కమిటీ సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, సుజాత దంపతులు ఆకు పూజ చేశారు. సుందరకాండలోని హనుమత్ వైభవంపై నారాయణ మూర్తి ప్రసంగించారు. స్వామికి విశేష అభిషేకాలు, నాగవల్లి దళార్చన, అలంకరణతోపాటు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

■ స్థానిక కొత్తపేట (నాజ్ కూడలి)లోని శ్రీఆంజనేయ స్వామి దేవస్థానంలో హనుమాన్ జయంతి వైభవంగా నిర్వహించారు. స్వామికి పంచామృతాలు, మూలికా ద్రవ్యాలు, క్షీరాభిషేకాలతో సహస్ర ఘటాభిషేకం, మన్యసుక్త హోమం నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించారు. రాత్రి శ్రీ సువర్చలా సమేత ఆంజనేయస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. శ్రీ హనుమాన్ దీక్ష సమాజం అధ్యక్షులు తిరువళ్లూరు వెంకటసుబ్బారావు ఆధ్వర్యంలో జరగ్గా, దేవస్థానం ఈవో టి.సుభద్ర పర్యవేక్షించారు. కార్యక్రమంలో దీక్ష సమాజం సభ్యులు నాగేశ్వరరావు, వంశీ ప్రసాద్, రమేష్, వెంకటరమణ, మారుతి, సుబ్రహ్మణ్యం, బాపిరాజు పాల్గొన్నారు. కొత్తపేట, తూర్పు ట్రాఫిక్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

**ఏటుకూరులో హనుమాన్ జయంతి వేడుకలు**



విజేతలకు బహుమతి అందజేస్తున్న తులసి రామచంద్రప్రభు

కొరిటెపాడు: రూరల్ పరిధిలోని ఏటుకూరు వీరాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. తులసి సంస్థల అధినేత తులసి రామచంద్ర ప్రభు కుటుంబ సమేతంగా హాజరయ్యారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులంతా 'జై శ్రీరామ్ – జై హనుమాన్' అంటూ భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. టీడీపీ సీనియర్ నాయకుడు ఉగ్గిరాల సీతారామయ్య ఆధ్వర్యంలో మేళతాళాలు, నాగం రేణుకాదేవి అండ్ టీం కోలాటం, నృత్యాలు ఆకర్షణంగా నిలిచాయి. జిడుగు సుబ్బారావు, వర్మ, వెంకట్ ఆధ్వర్యంలో 60 మంది అదరహో అని అనిపించేలా కర్రసాము విన్యాసాలు చేశారు. స్వామి సన్నిధిలో 15 వేల మంది భక్తులకు అన్న ప్రసాద వితరణను తులసి రామచంద్ర ప్రభు ప్రారంభించారు. కర్రసాము ప్రదర్శన అనంతరం బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. నెల రోజుల నుంచి స్థానిక కార్పొరేటర్ దాసరి లక్ష్మీ దుర్గ, వాసు ఆధ్వర్యంలో కర్రసాము, కోలాటాల బృందాలకు ఏర్పాట్లు చేశారు. గత 18 సంవత్సరాలుగా హనుమాన్ జయంతి వేడుకలకు సహకరిస్తున్న తులసి రామచంద్ర ప్రభుని కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు.

### హనుమాన్‌కు నూరి ఫాతిమా పూజలు



పూజల్లో పాల్గొన్న నూరి ఫాతిమా

పట్నంబజారు: హనుమాన్ జయంతి పురస్కరించుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏటుకూరు బైపాస్ రోడ్డులో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో నాని, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారుల నుంచి పెద్దల వరకు భక్తిభావంతో కొలిచే దేవుడు హనుమంతుడని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పూనూరి నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, చింతా రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం అన్నదానాన్ని నిర్వహించారు.

**బ్రాహ్మణ సేవా సమితి కార్యాలయంలో వేడుకలు**



బ్రాహ్మణ సేవా సమితి కార్యాలయంలో భక్తి సంకీర్తన

నగరంపాలెం: బ్రాడీపేట 1/13వ అడ్డ రోడ్డులో గల బ్రాహ్మణ సేవా సమితి కార్యాలయంలో స్వరరాగ సుధా గుంటూరు ఆధ్వర్యంలో హనుమత్ జయంతి వేడుకలు జరిగాయి. సమితి కార్యవర్గ సభ్యుల సహకారంతో భక్తి సంకీర్తన నిర్వహించారు. గాయకులు కె.వి.సాయిబాబాశర్మ, ఆర్.పి.ఎల్. నరసింహారావు, సీతారమేష్, శ్రీనివాస్, పి.ఎస్.ఎన్.మూర్తి భక్తి గీతాలు ఆలపించారు. కీ బోర్డుపై రామకృష్ణ శర్మ, తబలాపై బాలాజీ వాయిద్య సహకారాన్ని అందించారు.

# వార్డుల వారీగా సమగ్ర పారిశుద్ధ్య నిర్వహణ

నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర



నగరంలో పర్యటిస్తున్న మేయర్ రవీంద్ర, కమిషనర్ శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరంలో వార్డుల వారీగా సమగ్ర పారిశుద్ధ్య పనులను మెగా క్లీన్ డ్రైవ్ ద్వారా చేపట్టి క్లీన్, గ్రీన్ నగరంగా తీర్చిదిద్దుకుందామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర చెప్పారు. 9,10వ వార్డుల్లోని సుద్దపల్లి డొంక, యాదవుల బజార్, అలీ నగర్, బాలాజీ నగర్ తదితర ప్రాంతాల్లో గురువారం ఆయన నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహ్మద్ నసీర్‌తో కలిసి పర్యటించారు. మెగా క్లీన్ కార్యక్రమాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో ప్రతి వార్డు స్వచ్ఛంగా తీర్చి దిద్దుకోవడానికే మెగా క్లీన్ కార్యక్రమం చేపట్టామని వివరించారు. ప్రధానంగా శివారు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, డ్రైనేజీ, రోడ్లు తదితర మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. కమిషనర్ మాట్లాడుతూ వార్డ్‌లో సాధారణంగా విధులు నిర్వహించే కార్మికులతో పాటు అదనంగా 225 మందితో ప్రతి వీధిని, డ్రైయిన్లను శుభ్రం చేయడం, అనధికార హోర్డింగ్స్, బోర్డ్‌లు తొలగించడం చేపడతామని వివరించారు. కార్యక్రమంలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, సిటీ ప్లానర్ రాంబాబు, ఈఈ సుందర్రామిరెడ్డి, కార్పొరేటర్లు యల్లావుల అశోక్, ఈరంటి వరప్రసాద్, షేక్ మీరావలి, సంకూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి**

యోగాంధ్ర- 2025ని నగర ప్రజలంతా విజయవంతం చేయాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర కోరారు. గురువారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆసక్తి కల్గిన వారు వెబ్‌సైట్ ద్వారా వివరాలు నమోదు చేసుకొని విజయవంతం చేయాలని కోరారు.

**యోగాపై అవగాహన కల్పించాలి**

నగరంలో యోగాంధ్ర- 2025 కార్యక్రమ అమలుపై ఆసక్తి కలిగిన యోగా మాస్టర్ ట్రైనీలతో కమిషనర్ తన చాంబర్‌లో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 21 నుంచి జూన్ 21 వరకు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యోగాంధ్రలో నగర ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొనేందుకు సన్నాహాలు చేపట్టామని తెలిపారు. వార్డ్‌ల వారీగా జీఎంసీ ఏర్పాటు చేసే శిబిరాల్లో శిక్షణ ఇచ్చేందుకు ట్రైనర్లు అవసరమని చెప్పారు. మాస్టర్ ట్రైనీలు తమ దగ్గర శిక్షణ ఇచ్చే వారి వివరాలను తమకు అందించాలని ఆయన కోరారు.